# జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించాలి

**- విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించి సైన్స్‌పై మక్కువ పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే:జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**ఈ విద్యా సంవత్సరం జిల్లా స్థాయి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి జనవరి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు నమోదు చేసుకునేలా చూడాలని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కలెక్టర్‌కు సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను వారి వారి పాఠశాలల్లోనే ఏర్పాటు చేసుకొని దానికి సంబంధించిన వీడియోను 30 ఎంబీకి మించకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఏవేని రెండు అంశాలపై ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. జనవరి 1 నుంచి 18వ తేదీ వరకు నమోదు చేయాలని, వైజ్ఞానిక ప్రదర్శనతో పాటు విద్యార్థులకు సెమినార్‌ను కూడా నిర్వహిస్తారన్నారు. సెమినార్ అంశమును వీడియో తీసి సిడిని డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శనలో మంచి ప్రదర్శనలు ప్రదర్శించేటట్టు సైన్స్ మరియు గణిత ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి 9989921105ను సంప్రదించాలని కోరారు.

# అంబేద్కర్ అడుగు జాడల్లో నడుద్దాం...

**రాష్ట్ర ఎక్సైజ్,టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**పానుగల్,డిసెంబర్ 31,ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్,టూరిజం శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. ఆదివారం పానుగల్ మండల పరిధిలోని మాధవరావు పల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాయవాదిగా,ఆర్థిక శాస్త్రవేత్తగా,సంఘ సంస్కర్తగా అంబేద్కర్ పేరుగాంచారని అన్నారు.అంటరానితనం,కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని మంనరతి అన్నారు.దళితులు,మహిళలు,కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడనీ,కుల,మత రహిత ఆధునిక భారత దేశం కోసం అంబేద్కర్ తన జీవితకాలం పోరాటం చేశారన్నారు.దళితుల పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేదనీ,అంటరానితనం గురించి ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్,మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు,మాజీ జెడ్పీటీసీ రవి,సర్పంచ్ సునీత,నాయకులు గోవర్ధన్ సాగర్,భాస్కర్ యాదవ్,బ్రహ్మం చారి,రాంచందర్,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం...

**- జిల్లా ఏఎస్పీ సీహెచ్.రామేశ్వర్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**మహిళలు, యువతులు,బాలికలు,ఆకతాయిలవలన గానీ,మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని జిల్లాఏఎస్పీ సీహెచ్.రామేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళల రక్షణకోసం షీటీమ్స్ ,యాంటీ ఉమెన్‌ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థినులు,మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.కళాశాల,పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు గురైన, మహిళలు పనిచేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైన, బాలికలపై ఎవరైన లైంగిక వేధింపులకు పాల్పడిన వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసును ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఏఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ఇప్పటి వరకు 2023 సంవత్సరంలో 103 ఫిటిషన్స్ రాగా అందులో 42 ఎఫ్ఐఆర్, 4 పెట్టి కేసులు, రెస్పాండెంటెన్స్ 55 మందిని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. 140 అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, డిసెంబర్ నెలలో 16 ఫిర్యాదులు రాగా, 2 ఎఫ్ఐఆర్‌లు, ఒక పెట్టి కేసు నమోదు కాగా, రెస్పాండెంటెన్స్ 13 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరుగా సంప్రదించలేని వారు 8712657676 లేదా 100కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

# ప్రజలకు జవాబుదారిగా భాధ్యతగా పనిచేద్దాం...

**మిగిలిపోయిన రోడ్ల విస్తరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి.**

**బిఆర్ఎస్ కౌన్సిలర్లతో మాజి మంత్రి సమీక్ష**

**మాజి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** ప్రజలకు జవాబుదారిగా భాధ్యతగా పని చేయడంతో పాటు జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయించిన నిధులు వినియోగిస్తే అభివృద్ధి కొనసాగే విధంగా బిఆర్ఎస్ కౌన్సిలర్లు కృషి చేయాలని మాజి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడినడ నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసగృహంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజి మంత్రి మాట్లాడుతూ ప్రజలు మనకు అండగా నిలుస్తూ కేవలం 1.7 శాతం ఓట్లతో కాంగ్రెస్ పార్టికి అధికారం ఇచ్చారని, ఎవ్వరు కూడా నిరాశ, నిస్పృహకు తావు లేకుండా రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ , పట్టణ పార్టి అధ్యక్షులు రమేష్ గౌడ్, కౌన్సిలర్లు భువనేశ్వరి, పుట్టపాకుల మహేష్, లక్ష్మినారాయణ, కంచెరవి, నక్క రాములు, జంపన్న, బాష్య నాయక్, నాగన్న యాదవ్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజి మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

# మాట తప్పను..ఆరు గ్యారంటీలు అమలుచేస్తాం..!

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 31 ప్రభాతవార్త :** ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట తప్పనని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నపేట ప్రజలు ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాల్గొని ప్రసంగించారు. గత ప్రభు త్వం పది సంవత్సరాలు హామీలు ఇచ్చి మోసం చేసింది, ఇచ్చిన మాటను నిల బెట్టుకునే ప్రయత్నం కూడా చేయలేదు. దానివల్ల నష్టపోయింది కేవలం ప్రజలు మాత్రమే అని ఆయన చెప్పారు. పెద్ద పెద్ద చదువులు చదివిన మన బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస వారి భవిష్యత్తు నేడు అయోమయంగా మార్చింది గత ప్రభుత్వం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట మీద నిలబడేది అని, అందుకే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు అందిస్తామని, వాటి అమలు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన అభయహస్తం పేరుతో ప్రజల నుంచి వివరాలు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైల్వేగేట్ తరువాత అభివృద్ధి మందగించడం వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందని ఆయన చెప్పారు. రైల్వేగేట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం వారితో చర్చించి, దానిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే వీరన్నపేటలోని డంపింగ్ యార్డు ప్రధాన సమస్య కాబట్టి వీలైనంత త్వరగా డంపింగ్‌యార్డును పట్టణానికి దూరంగా తరలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యం విద్య, వైద్యం, అందులో భాగంగా వీరన్నపేటలో బస్తి దవాఖాన అన్ని వసతులతో ఏర్పాటు చేస్తామని, మహబూబ్‌నగర్ విద్యార్థులకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా ఇంజనీరింగ్ కళాశాలను అందుబాటులోకి తేవడం జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం వీరన్నపేట వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డా. మగ్బుల్, ఎన్‌పి వెంకటేష్, సాదుల్లా, ఖలీల్, అన్వర్, ఖలీం, అసాద్, హఫీస్, బిలాల్, జలీల్ అక్తర్, అజ్మత్ అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

## జిల్లా ప్రజలకు ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, ఎమ్మెల్యే



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** ఉన్నత లక్ష్యాలు, ఉన్నత ఆలోచనలతో జిల్లా ప్రజలు 2024 సంవత్సరంలో అడుగిడుతూ వాటిని నెరవేర్చుకునే విధంగా కృషి చేయాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలను వేర్వురుగా తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ఇష్టంగా చదువుతూ చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా అంకితభావం కనబరిచి జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలని కోరుతూ ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలను తెలిపారు.

# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# న్యూ ఇయర్.. జోష్





- కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి..
- జనసందడిగా మారిన బేకరీలు
- ఆఫర్లు పెట్టి ఆకర్షిస్తున్న వ్యాపారులు
- రంగుల కొనుగోళ్లలో మహిళలు బిజీ బిజీ..
- అర్ధరాత్రి వరకు యువత సంబురాలు..
- కొత్త ఏడాదికి ఘనస్వాగతం

**కాలగమనంలో మరో ఏడాది గడిచిపోయింది. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కొత్త ఏడాదికి ఘనస్వాగతం పలికారు.. అర్ధరాత్రి వరకు డ్యాన్సులు, సంబురాలతో కోలాహలంతో సందడి సందడిగా గడిపారు. కాలనీల్లో మహిళలు, చిన్నారులు కేకులు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి, ఆటపోటీలతో ఉత్సాహంగా గడిపారు. చౌరాస్తాల్లో యువత డీజేల శబ్దాల నడుమ రంగులు చల్లుకొని జోష్ పెంచారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బేకరీలు, రంగుల దుకాణాల వారు,పూల దుకాణాలు కిటకిటలాడాయి.**

*- మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్31, ప్రభాతవార్త*

**నూతన సంవత్సరానికి స్వాగతం..**

కాలగర్భంలో మరో ఏడాది గిడిచిపోయింది. చూస్తుండగానే మరో ఏడాది కలిసిపోయింది. కొత్త ఏడాదికి 2024కు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు ఘనస్వాగతం పలికారు. అర్ధరాత్రి వరకు వేచి ఉండి సమయం 12గంటలు దాటగానే కేకలు, ఉర్రూతలూగుతూ ఉత్సాహంగా కొత్త సంవత్సరానికి ఘనస్వాగతం పలికారు. పటాకులు కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. కొంగొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి వెళ్లారు. ఎక్కడ చూసినా సందడి సందడిగా మారింది. గతానికి గుడ్ బై చెప్పి నూతన ఏడాదికి కోటి ఆశలు పెట్టుకున్నారు.

**కుటుంబ సమేతంగా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువత ఫుల్ జోష్‌లో న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. అయితే అందుకు భిన్నంగా కుటుంబ సభ్యులు కూడా ఇంట్లోనే పిండి వంటలు, చికెన్, వెజ్ బిర్యానీలు కూల్ డ్రింక్స్ తెచ్చురొని పార్టీ చేసుకుంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. సౌండ్ బాక్సులు పెట్టుకొని చిన్నారులు, మహిళలు ఆనందంగా గడిపారు. కొత్త దుస్తులు ధరించి, అలంకరణ చేసుకొని చక్కని వంటకాలు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ కబుర్లు చెప్పుకుంటూ ఆరుబయట చలిమంట వేసుకుంటూ కొత్త ఏడాదిని ఆహ్వానించారు. జోష్ అనగానే దోస్తులు, మందు,బిర్యానీలు, డీజే డ్యాన్సులే కాదని కుటుంబంతో గడపడం కూడా ఒక కొత్త అనుభూతి అని నిరూపించారు.

**దుకాణాలు కిటకిట..**

నూతన వేడుకల సందర్భంగా బేకరీలు, రంగుల దుకాణాలు, పూల దుకాణాలు కిటకిటలాడాయి. బేకరీల్లో కేకులకు ఆఫర్లు పెట్టి మరీ వ్యాపారం కొనసాగించారు. చౌరస్తాలో టెంట్లు ఏర్పాటు చేసి కేజీ కేక్ కు లీటర్ కూల్ డ్రింక్ ఆఫర్లు పెట్టి మరీ విక్రయించారు. ఆఫ్ కేజీ కేక్‌కు ఆఫ్ లీటర్ కూల్ డ్రింక్ ఆఫర్లు పెట్టి కొనుగోలుదారులను ఆకర్షించారు. దీంతోపాటు రంగుల దుకాణాలు సందడిగా మారాయి. మహిళలు, చిన్నారులు ఇంటి ముందు ముగ్గు వేసి రంగులు వేయడం ఆనవాయితీ. హ్యాపీ న్యూ ఇయర్ అని ముగ్గుతో రాసి అందులో రంగులు వేసి మురిసిపోతుంటారు.

మంచికి స్వాగతం పలుకుదాం..

గత ఏడాదిలో చేసిన తప్పులను అధిగమిస్తూ కోటి ఆశలతో కొత్త ఏడాదిలోకి స్వాగతం పలుకుదాం. గత ఏడాదిలో మనం పూర్తి చేయలేని పనులను ఈ ఏడాదిలో పూర్తి చేసేలా ప్రణాళికలు చేసుకోవాలి. గతంలో చేసిన చెడును అన్ని చెడు జ్ఞాపకాలను వదిలేస్తూ కొత్త ఏడాదిలో అద్భుతమైన ఆలోచనలతో ఎలాంటి ఒడిదుడుకులు, ఆటంకాలు లేకుండా కొనసాగాలని కోరుకుందాం.కొత్త ఏడాదిలో మనం చేసే ప్రతి పని విజయవంతం కావాలని, ఆదిశగా ప్రతి ఒక్కరూ కృషి చేద్దాం.



# దశలవారీగా పథకాల అమలు..

**సంవత్సరంలోపు సింగోటం గోపాల్దిన్నె లింకు కెనాల్ పూర్తి.**

**సీఎం రిలీఫ్ ఫండ్ లో అవినీతిని సహించేది లేదు విచారణ జరిపించాలని జెయింగ్ కలెక్టర్కు ఆదేశం:మంత్రి జూపల్లి కృష్ణారావు**



నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల,డిసెంబర్31,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రభుత్వ పథకాలు ఏవైతే ఉన్నాయో ఆరు గ్యారెంటీలను దశలవారీగా అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మరియు పర్యాటక శాఖ.పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆదివారం నాడు వీపనగండ్ల మండలంలోని సంగినేనిపల్లి నూతన గ్రామపంచాయతీ ప్రారంభోత్సవ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు ఈ సందర్భంగా 20 లక్షలతో ఎంజిఎన్ఆర్ నిధుల ద్వారా మంజూరు చేసిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ఆ గ్రామ సర్పంచ్ ఆర్ మౌలాలి ఆధ్వర్యంలో ప్రారంభించారు.అనంతరం ఆయన సమావేశంలో మాట్లాడుతూ అధికారులు అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా సహించేది లేదు అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.గ్యాస్ సిలిండర్ మరియు ధరణి పెబ్సైట్లో భూములకు సంబంధించినటువంటి పనులు ఏవైతే జరుగుతున్నాయో వాటిలో అధికారులు గానీ గ్యాస్ ఏజెన్సీలు కానీ డబ్బులు వసూలు చేస్తే అధికంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. అంతేకాక గోపాల్ దీన్నే సింగోటం లింకు కెనాల్ ఏదైతే ఉందో దాన్ని సంవత్సరం లోపల పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.అంతేకాక సంగినేనిపల్లి గ్రామంలో గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ పండును అక్రమంగా వాడుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దాదాపు కోటి పది లక్షలకు పైగా దుర్వినియోగం జరిగినట్లు తెలిసిందని తక్షణమే వాటిపై విచారణ జరిపించాలని జాయింట్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి ఆరు గ్యారెంటీలలో రెండింటిని ఇప్పటికే అమలు చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టడం జరిగిందని మిగతా నాలుగు ఇంటిని అమలు చేయాలంటే ప్రజలకు కావలసినటువంటి గూడు విద్య వైద్యం రేషన్ కార్డులు తదితర సమస్యల పరిష్కరించాలంటే వారి అవసరాలు ఏమి అని ప్రభుత్వానికి తెలియాల్సి ఉన్నది అనే సదుద్దేశంతో ప్రజా పాలన నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ప్రజలు ఎవరు కూడా పేదరికంతో ఇబ్బంది పడకుండా వారి యొక్క అవసరాల నిమిత్తం ప్రభుత్వం తగు చర్యతు తీసుకుంటుందని ఆయన తెలిపారు.గత ప్రభుత్వము నిధులు ఏమీ మిగిల్చకుండా చేసి పోయిందని దాన్ని ఇప్పుడు పూడ్చుకునే పనిలో ప్రస్తుత ప్రభుత్వం ఉన్నదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు ప్రజలు ఎవరైనా అనారోగ్యాలకు గురి అయితే తెలంగాణలో ఉన్న ఆరోగ్య కేంద్రాలలోనే చూయించుకోవాలని ఆయన సూచించారు.ఆ విధంగా చూయించుకున్న వారికి ఆరోగ్య భీమా ఇన్సూరెన్స్ వర్తిస్తదని ఆయన తెలిపారు.ఈ విషయాలు తెలుసుకునేటందుకోసం కొల్లాపూర్ లో ఉన్న క్యాంప్ ఆఫీస్ దగ్గర ఇద్దరిని ఏఎన్ఎంల ను పెట్టి హెల్త్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించే కోసం ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చి వాటి ద్వారా సమాచారం క్యాంప్ ఆఫీస్ లో ఉన్నవారికి తెలియజేస్తే తక్షణమే వారికి సంబంధించిన సహాయం అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.సంగినేనిపల్లి గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనుల పై ఆయన మాట్లాడే కన్నా ముందు సర్పంచ్ ఆర్ మౌలాలి ఆయన దృష్టికి తీసుకువచ్చారు వాటికి సంబంధించి అధికారులతో సంప్రదించి కొన్ని పనులను పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తామని అంతేగాక మిగతా పనులు కూడా సిసి రోడ్ల గ్రామ అభివృద్ధికి సంబంధించి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని ఆయన ఆ గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జాయింట్ సంచిత్ అగర్వాల్ మండల జడ్పిటిసి మాధురి కిరణ్ గౌడు తూముకుంట సింగిల్ విండో అధ్యక్షుడు రామన్ గౌడు చెన్నయ్య డీఈ సురేష్ కుమార్ జిల్లా పంచాయతీ అధికారి ఎంపీడీవో కథలప్ప మరియు రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి సంగినేనిపల్లి గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మయ్య వార్డు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామ్ వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు..

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాలమూరులో అత్యంత వైభవంగా శోభాయాత్ర**

**పాల్గొన్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ, శాంతికుమార్**



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 31 ప్రభాతవార్త :** ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తూర్పు కమాన్ దగ్గర శ్రీరామ జన్మభూమి అక్షింతల శోభయాత్రను ప్రారంభించి ఆయన మాట్లాడారు. శ్రీరాముడు చూపిన మార్గంలో మనందరం కలిసి నడవాలని ఆయన చెప్పారు. ఎన్ని కష్టాలు బాధలు ఎదురైనా ఏనాడు ఆయన ధర్మాన్ని విస్మరించలేదని ఆయన తెలిపారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పే గొప్పఘట్టం శ్రీరామ మందిర నిర్మాణం అని ఆయన అన్నారు. అనంతరం భజన మండలి, విశ్వహిందూ పరిషత్ సభ్యులతో కలసి శ్రీరాముల రథం ముందు రామనామ సంకీర్తనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ, బిజెపి రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, నాయకులు మిథున్‌రెడ్డి, ఎన్‌పి వెంకటేష్, మద్ది యాదిరెడ్డి, జి. చంద్రయ్య, రెబ్బ విఘ్నేష్, బుచ్చిరెడ్డి, ఎ.నరేంద్ర, బురుజు సుధాకర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, డి. శ్రీధర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



కన్నుల పండువగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న బిజెపి నాయకులు



## స్మృతివనంలో మార్నింగ్ వాకర్స్‌తో న్యూ ఇయర్ అడ్వాన్స్ సెలబ్రేషన్స్‌లో జిల్లా ఎస్పీ

**గద్వాల ప్రతినిధి,డిసెంబరు 31 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో స్మృతి వనంలో ఆదివారం సాయంత్రం 5 గం.లకు మార్నింగ్ ఈవినింగ్ వాకర్స్‌తో కలిసి న్యూ ఇయర్ సెలబ్రేషన్ సందర్భంగా అడ్వాన్స్‌గా కేక్ కట్‌చేసి 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరు న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకుని ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని ఆమె అన్నారు. అదేవిధంగా చదువుకుంటున్న విద్యార్థులు ఎగ్జామ్స్ దగ్గర పడుతున్న సందర్భంలో ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థి పరీక్షల కొరకు ప్రిపరేషన్ మంచిగా చదువుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పార్కులో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్మృతివనంలో మహిళలకు ప్రత్యేకంగా మంచినీటి వసతి, లైటింగ్, వాష్ రూమ్‌లు సెక్యూరిటీ పరంగా అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా జిల్లా కలెక్టర్ దృష్టిక తీసుకెళ్తానన్నారు. మార్నింగ్, ఈవినింగ్ వాకర్స్‌తో కలిసి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అరుణ, కె. మాధవి, డిఆర్ మంజుల, కె. సంధ్యారాణి, పి. జ్యోతి, కౌన్సిలర్ మహేశ్వరి తదితర మహిళలు ఉన్నారు.



## త్యాగానికి ప్రతిరూపం అమ్మ...

**- డాక్టర్ వినోదినికి మశమ్మ స్మారక పురస్కార్ ప్రధానం**

**- ఉస్మానియా విశ్వ విద్యాలయ తెలుగు విభాగ అధిపతి ప్రొఫెసర్ కాశీం**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** అమ్మ త్యాగానికి ప్రతిరూపమని ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కాశీం అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశపు హాల్‌లో ఎదిరేపల్లి మశమ్మ స్మారక అవార్డును కడప యోగివేమన యూనివర్సిటీ కవయిత్రి సా మాజిక ఉద్యమకారిణి డాక్టర్ వినోదినికి ఎదిరేపల్లి స్మారక అవార్డును అందించారు. అవార్డుతో పాటు శాలువ మెమెంటో సన్మాన పత్రము మరియు రూ.20వేల నగదును ప్రొఫెసర్ కాశీం సత్కరించి అందించారు. ఈ సభకు కల్వకోల్ మద్దిలేటి సభా ధ్యక్షత వహించారు. మశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాశీం మాట్లాడుతూ వీరుడైన, ఉద్యమకారుడైన, శ్రామికుడైన ప్రాణికైన జీవరా శికైనా అమ్మ అమ్మనే, అమ్మకు ప్రత్యామ్నాయం లేదన్నారు. అమ్మ మశమ్మైనా నాగమ్మైనా బాలమ్మై నా ఆగ్నేసమ్మైనా అమ్మీజానైనా అమ్మనేనని , నదినీళ్లు ఒక్కటేనని చనుబాల తీపి ఒక్కటేనని అమ్మ ఓ శ్రమ దేవతంటూ అమ్మ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జెట్టి ధర్మరాజు, హెచ్.రమేష్‌బాబు, విద్యావేత్త భాస్కర్‌రావు, అవార్డు చైర్మన్ ఎదిరేపల్లి కాశన్న, వహీద్ ఖాన్, కందికొండ మోహన్, ముచ్చర్ల దినకర్, వనపట్ల సుబ్బయ్య, నాగవరం బాల్‌రాం, ప్రతాప్ కౌటిల్య, గుడిపల్లి నిరంజన్, దేవరపాగ ప్రభాకర్, వెంకట్ పవార్, మహమ్మద్ ఖాజా, నీరటి బాలీశ్వర్, బ్రహ్మాచారి, ఎజ్జుమల్లయ్య, ఎదిరేపల్లి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.



## నిరుపేద వృద్ధులకు చీరల పంపిణీ..

**చిన్నచింతకుంట,డిసెంబరు 31 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆదివారం ముందస్తు న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా నిరుపేద వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాబోయే నూతన సంవత్సరంలో ప్రజలందరు సంతోషంగా జీవించాలని ఆమె కోరారు. పేద, వృద్ధ మహిళలకు చీరల పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఎస్. శేఖర్‌ను ఆమె అభినందించారు. అనంతరం పేద, వృద్ధ మహిళ లకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం న్యూ ఇయర్ కేక్‌ను కట్‌చేసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. అంతకు ముందు స్థానిక ఎంబి సీయోను చర్చి చైర్మన్ జి. మోషే బైబిల్ వాక్యం సందేశంతో పాటు ప్రార్ధన ఆశీర్వాదాన్ని అందించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మహమూ ద్,స్థానికనాయకులు బండి బషీర్, హరీష్, శాంసన్, గుండన్న, కృపాకర్, సోలమన్‌సాగర్, దినకర్, కె.చిన్న, ఎం. ప్రమోదర్, దినకర్, అజయ్, ప్రవీణ్, మహేష్, అబ్రహం, బాచి, అజయ్, జాన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## నిరుద్యోగులకు శుభవార్త చెప్పాన కాంగ్రెస్ ప్రభుత్వం..

**యువకులు మద్యానికి బాని సై కుటుంబానికి దూరం కావొద్దు**

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి**



**కొత్తకోట,డిసెంబర్ 31,ప్రభాతవార్త :** నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు అందించిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్ణాకర్ రెడ్డి అన్నారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు.యువకులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.యువకులు అందరికీ ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు.యువకులు చదువు పై శ్రద్ధ చూపాలని,తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదని ఉద్యోగాలు వేయకుండా నిరుద్యోగులను రోడ్ మీద పడేట్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయని తెలిపారు.ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ఉద్యోగాల భర్తీ చేస్తాననడం సంతోషంగా ఉందని అన్నారు.అదేవిధంగా నూతన సంవత్సరం సందర్భంగా కొత్తకోట మండల గ్రామాల యువకులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోయి కుటుంబాలకు దూరం కావద్దని హెచ్చరించారు.ముందుగా కొత్తకోట మున్సిపాలిటీ,మండల, స్వగ్రామైన కానాయపల్లి గ్రామ ప్రజలకు నూతన సంవత్సర,సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.మందు తాగి బండారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువకులను కోరారు.ఈ నూతన సంవత్సరంలో యువకులు బాగా చదివి ఉద్యోగం సాధించి కుటుంబంతో సంతోషంగా ఉండాలని అందుకు ఆ భగవంతుని ఆశీస్సులు మీకు ఎప్పుడు అండగా ఉండాలని కోరారు.

## కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా కాంగ్రెస్ ఆరోపణలు

**వనపర్తి టౌన్,డిసెంబర్ 31,ప్రభాతవార్త :** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కౌన్సిలర్లతో జరిగిన సమావేశములో కాంగ్రెస్ చేసిన బూటక ప్రచారం చేసి అధికారంలోకి ఎట్లా వచ్చింది అని వివరణ ఇచ్చారు.అందులో వారు అంటూనే సంబోధిస్తూ మాట్లాడారు.అది కూడా ఎన్నికల ముందు జరిగిన సంఘటన గూర్చివివరించారు.దీన్ని చిలువలు,వలువలు చేస్తూ ఆరోపణలకు నిరూపించే దమ్ము లేక తోకముడిచిన మీరు చిన్న చిన్న తప్పులు వెదుకుతూ బురద చల్లి ప్రజలను మభ్య పెట్టడం మానుకోవాలి,తప్పుడు ఆరోపణలతో ఎన్నికలలో గెలిచి మా అంతరంగిక విషయాలలో జోక్యం చేసుకొని మా నాయకులను లొంగదేసుకోవడానికి చేసిన ప్రయత్నాలను మా నాయకుడు సమర్ధవంతంగా తిప్పికొట్టినందుకు తట్టుకోలేక చిల్లర ఆరోపణలు చేయడం తగదని హెచ్చరిస్తున్నా అని మాట్లాడారు రాష్ట్రానికి ప్రజలు అడగని పథకాలు తెచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వారినే నోటికి వొచ్చినట్లు మాట్లాడిన యూట్యూబ్ గాళ్లకు పైసలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వాళ్ళ,కొంపలు మునిగినట్లు గుండెలు బాదుకుంటున్నరు పస్లు ప్రజలకు ఇచ్చన హామీల ప్రకారం ఫించన్లు రైతుబంధు కాడికి ఇయ్యండి తర్వాత సంగతి సూతం గాని అని మాట్లాడారు.



## రైతు జీవితాన్ని గుర్తు చేసుకున్న మంత్రి జూపల్లి..

**కొల్లాపూర్,డిసెంబరు 31 ప్రభాతవార్త :** మండల పరిధిలోని తన స్వగ్రామమైన పెద్ద రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రైతుగా తన కుటుంబ నేపథ్యాన్ని గుర్తు చేసుకున్నారు. గ్రామంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలలో తన కుటుంబం సైతం వ్యవసాయం చేశామని, ఎద్దులతో నాటి వ్యవసాయం ఎంతో సాంప్రదాయకంగా జీవ ఎరువులతో పంటలు పండించే వారని నేడు రసాయన ఎరువులను వాడుతూ తినే ఆహార పదార్థాలను సైతం కల్తీకి గురవుతున్నాయని తన వ్యవసాయం చేసిన వాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గ్రామానికి చెందిన గోపాలకృష్ణ యాదవ్ బండలాగే వృషభాలను చూసి వాటి గురించి వివరాలు తెలుసుకున్నారు. అనేక గ్రామాలలో ఎన్నో బహుమతులు గెలుపొందిన వృషభ జంటను, రైతు గోపాలకృష్ణ కుటుంబాన్ని అభినందించారు. అనంతరం రైతు కోరిక మేరకు వృషభాలకు పెరు పెట్టమని కోరగా, సూర్యచంద్రులని నామకరణం చేశారు. దీంతో రైతు అమితానందం పొందారు. గ్రామస్తులందరూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.



# డిజేలకే అనుమతి లేదు..

**నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి డీజేలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. రాత్రిళ్లు ఇష్టారీతిగా డీజే శబ్దాలతో జనాలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామంటున్నారు. ఎక్కడికక్కడ డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. - మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్31, ప్రభాతవార్త**



**- జనాలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు..**

**- ఎలాంటి ఈవెంట్లకు పర్మిషన్ ఇవ్వలేదు..**

**- తాగి వాహనం నడిపితే లైసెన్లు రద్దు..**

**- నూతన సంవత్సర వేడుకలకుపై పోలీస్ శాఖ నజర్**

అర్ధరాత్రి సమయాల్లో డీజే వినియోగించడం ద్వారా ప్రజలు చాలా ఇబ్బందులు గురవుతారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. డీజే శబ్దాలతో వందలాది కుటుంబాలు ఇబ్బంది పడాల్సి వస్తున్న నేపథ్యంలో సర్కారు కఠిన చర్యలు తీసుకుంటున్నది. ఇదే విషయమై చాలా సందర్భాల్లో పంచాయితీలు జరిగి కొట్టుకుని, కేసులు కూడా పెట్టుకునే దాకా వెళ్లారు. ఇష్టారీతిగా మద్యం సేవించి పెద్ద పెద్ద శబ్దాలతో డ్యాన్సులు చేస్తూ రోడ్లపై విచ్చలవిడిగా వ్యవహరించడం తరుచూ జరిగే సంఘటనలే. ఇలాంటి వాటిపై చాలా మంది చూస్తూ చూడనట్టు వెళ్లాల్సి వచ్చేది.

**డయల్ 100కు ఫిర్యాదులు..**

అధిక శబ్దాల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురైతే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని అధికారులు చెబుతున్నారు. రాత్రి 10గంటలు దాటితే ఎలాంటి సౌండ్స్ వినియోగించడం కానీ, వాయిద్యాలు ఉపయోగించడం కానీ చేయరాదని సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ కూడా ఉన్న నేపథ్యంలో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందులు మాత్రం తప్పవు. అయితే డీజేలు, బ్యాండ్ మేళాలు పూర్తిగా నిషేధం కాదు. వాటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని శుభకార్యాలు, ఊరేగింపులు,బ్యాండ్ మేళాలు వాయిద్యకారులు ఆర్థిక కష్టాలను పరిగణలోకి తీసుకొని వెసులుబాటు కల్పించారు. ఇచ్చిన గడువుకు మంచి ఒక్క నిమిషం ఆలస్యమైనా డీజే సౌండ్స్, వాహనం ఇతర పరికాలను సీజ్ చేస్తామని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**పిల్లలు,వృద్ధులు, మూగజీవులు..**

అతి భయంకర డీజే శబ్దాల వల్ల పసిబిడ్డలకు, వృద్ధులకు, మూగజీవులకు, ముఖ్యంగా హృదయ సంబంధ వ్యాధులతో బాధ పడేవారికి చాలా ప్రమాదం. ఈ విషయం గుర్తెరిగి ప్రతి ఒక్కరు మెలిగితే అందరికీ మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగానే ప్రతి కుటుంబలో పిల్లలు, వృద్ధులు ఉండడం సహజం. మరి ఒకరి వ్యక్తిగత కుటుంబానికి సంబంధించిన కార్యాల్లో ఇష్టారీతిగా అనుమతి లేకుండా శబ్దాలతో అందరినీ ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు ఆమోదయోగ్యం ఒక్క సారి ఆలోచిద్దాం. ఇది ప్రతి ఒక్కరి సమస్యగా భావించి మెలుగుదాం.

**డయల్ 100కు ఫిర్యాదు చేయండి..**

డీజేలు, నూతన సంవత్సర ఈవెంట్లకు సంబంధించి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. డీజే వినియోగం ఎలాంటి పైరవీలకు తావు లేదు. డీజే, బ్యాండ్ వాయిద్యాలు వినియోగించే వ్యక్తులు ముందుగానే పోలీసుల నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలి. ఇష్టారీతిగా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అతి శబ్దాలతో ఇబ్బందులకు గురి చేస్తే సదరు వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేస్తాం. నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**- మహేశ్, డీఎస్పీ, మహబూబ్‌నగర్**

# ఫుల్ ఖుష్... దిల్ జోష్ ..!

**నయాసాల్‌కు వెల్‌కమ్ చెప్పేందుకు జనాల సన్నాహాలు ..**

**కేకులు , స్వీట్లకు పెరిగిన గిరాకీలు**

**కనుమరుగైన గ్రీటింగ్‌లు.. సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు**

**2023కు ఘనంగా వీడ్కోలు పలుకుతూ కొంగొత్త ఆశలు, ఆశయాలతో కలల భవనాలను నిజం చేసుకునేందుకు కొత్త లక్ష్యాలను ఎంచుకుంటూ లక్షణాలను మార్చుకోదల్చుకుంటూ నిండు కొత్తదనాన్ని జీవితంలోకి ఆహ్వానించేందుకు నూతన సంవత్సరానికి వెల్‌కం చెప్పేందుకు నూతన సంవత్సరానికి వెల్‌కం చెప్పేందుకు ఫుల్‌ఖు ష్ దిల్లంతా జోష్‌తో జిల్లా వాసులు సిద్ధమవుతున్నారు..**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** నేడు అర్ధరాత్రి 12 గంటలతో ఈ సంవత్సరానికి వీడ్కోలు పలికే సమయం వచ్చింది. అక్కడ నుండి 2024 సంవత్సరం ఆరంభ వేడుకలు పుంజుకుంటాయి. నయా జోష్ కోసం యూత్ ఒక్కటే కాదు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా భిన్న వర్గాలు ఎవరికి వారే జట్టు కట్టి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకునేందుకు సన్నాహాల్లో మునిగిపోయారు. చిన్నారులు, యువతులు గృహిణులు, తెల్లవారు జామున కాకుండా రాత్రి పడుకునే ముందే ఇంటి ముందు కల్లాపు చల్లుకుని కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే ముత్యాల ముగ్గులపై రంగులను అద్దేందుకు మార్కెట్‌లో వెలిసిన రంగుల దుకాణాల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఇక బేకరీలలో న్యూ ఇయర్ కేక్‌లను ప్రత్యేకంగా తయారు చేయించి అమ్మేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఎక్కడ చూసిన నయాసాల్ జోష్ కనిపిస్తుంది.



జిల్లా కేంద్రంలో రంగులు కొనుగోలు చేస్తున్న యువతులు



జిల్లా కేంద్రంలో బేకరీ షాపుల వద్ద కేకులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

**కేకులు, స్వీట్లకు పెరిగిన గిరాకి....**

కేకులు, స్వీట్లకు విపరీతంగా గిరాకి పెరిగిపోయింది. 2023 వీడ్కోలు పలుకుతూ 2024 కి స్వాగతం పలికేందుకు యువతి,యువకులు ఉత్సాహపడుతుండగా ఈ మేరకు కేకులు, స్వీట్ల కొనుగోళ్లతో బేకరీలు, స్వీట్ షాపులు కిటకిటలాడుతున్నాయి. నూతన సంవత్సరం వస్తుండంతో కేక్ కట్ చేసి నూతన సంవత్సరాన్ని ఆహ్వానించడం ఇటీవల ఆనవాయితిగా మారింది.

**కనుమరుగైన గ్రీటింగ్‌లు....**

గతంలో కొత్త సంవత్సరం వస్తోందంటే నెల రోజుల ముందు నుంచే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రకరకాల గ్రీటింగ్ కార్డులు అమ్మేవారు. యువత వాటిని కొనుగోలు చేసేందుకు బారులు తీసేవారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిపోవడంతో వాటి ప్రాధాన్యం తగ్గిపోయింది.

## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 31 ప్రభాతవార్త :** నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖంగా జీవించాలని, సంపద, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర, నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానని, ప్రజల ఆశీస్సులు, దీవెనలు ఎల్లవేళలా ఉండాలని అభిలషించారు.



## అమ్మవారి సన్నిధిలో బాలకృష్ణ సతీమణి

**ఇటిక్యాల,డిసెంబరు 31 ప్రభాతవార్త :** ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర ఆదివారం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమెకు దేవాలయ ఈఓపురంధర్, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. ముందుగా వినాయకుని పూజ అనంతరం బాల బ్రహ్మేశ్వరస్వామి రుద్రాభిషేకం అమ్మవారి దేవాలయంలో కుంకుమార్చనలు నిర్వహించి చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ చరిత్రను వారికి వివరించా రు. అనంతరం అమ్మవారి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరిం చారు.



## ప్రజలందరికి ఆంగ్ల నూతన సంవతర శుభాకాంక్షలు

**మాజి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 31, ప్రభాత వార్త :** ప్రజలందరికి మాజి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. నూతన సంవత్సరంలో తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రజలందరు సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.



## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఇటిక్యాల,డిసెంబరు 31 ప్రభాతవార్త :** 2024,25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతికి, సీఈఓ కళాశాలలో ఇంటర్ (ఎంపిసి, బైపిసి) మొదటి సంవత్సరానికిగాను ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఇటిక్యాల గురుకుల పాఠశాల/ కళాశాల ప్రధానాచార్యులు తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది జనవరి 6, ఇంటర్ ప్రవేశ పరీక్షకు చివరి తేది జనవరి 15 అని మరిన్ని వివరాలకు దరఖాస్తు చేయడానికి డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.టిఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్.ఎసి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని వారు తెలిపారు.

## వివాహ శుభకార్యానికి హాజరైన మంత్రి

**వీపనగండ్ల,డిసెంబర్ 31,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఓ శుభకార్యానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై వధూవరులను ఆశీ ర్వదించారు. సగ ణమని కృష్ణయ్య దంపతుల కుమా రుని వివాహ హాజరహై నూతన వధూవరులు 2023 సంవత్సరంలో ఒకటయ్యారు వారి యొక్క దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో పరిఢ విల్లాలని ఆయన అక్షింతలు వేసి దీవించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కృష్ణ ప్రసాద్ యాదవ్ రవీందర్ రెడిన్ల వంగల వెంకటరెడ్డి మహేష్ యాదవ్ నక్క విష్ణు రఘు బసవరాజ్ గౌడ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడిపందెపు స్థావరంపై దాడులు

**చిన్నచింతకుంట,డిసెంబరు 31 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పల్లమర్రి గ్రామంలోని వ్యవ సాయ పొలాల్లో కోడి పందాలు ఆడుతున్నారని సమాచారం మేరకు ఆదివారం ఎస్సై ఆర్. శేఖర్ తన పోలీస్ బృందంతో కోడిపందాల స్థావరంపై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరు కోళ్ల స్వాధీనం చేసుకుని ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కోడిపందాల జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# మొక్కు తీర్చుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**చిన్నంబావి,డిసెంబరు 31 ప్రభాతవార్త :** చిన్నంబావి మండల పరిధిలోని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తన స్వగ్రామంలో తన ఇష్ట దైవమైన తిరుమలనాథ స్వామికి మొక్కు తీర్చుకున్నారు. తన చిన్నతనం నుండి గ్రామంలో అతి పురాతన దేవాలయమైన తిరుమలనాథ స్వామిని ఆరాధించే వారిని తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తన స్వగ్రామంలో ఉన్న తిరుమలనాథస్వామి దేవాలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా ఇటీవల కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొంది రేవంత్‌రెడ్డి క్యాబినెట్లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఇదంతా నియోజకవర్గం ప్రజల దీవెనని, తెలంగాణ రాష్ట్ర, కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా ఆయురారోగ్యాలు అందించి రాష్ట్రాన్ని సుభిక్షంగా చూడాలని తన స్వగ్రామమైన పెద్దదగడలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సొంత గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా తాను అండగా ఉంటానని గ్రామ అభివృద్ధికి, గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మండల పరిధిలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుమలనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జూపల్లి



కాంగ్రెస్ జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి

# లింగాల రామాలయానికి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలు..

**లింగాల,డిసెంబరు 31 ప్రభాతవార్త :** శ్రీరాముని దివ్య సుందరమైన మందిర ప్రారంభోత్సవం జనవరి 22న జరగనున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం నుంచి ఆదివారం లింగాల మండల రామాలయానికి బాలరామునికి పూజలో ఉపయోగించిన అక్షింతలు చేరాయి. అక్షింతలను స్వామివారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ అయోధ్యలోని దివ్యమైన మందిర ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిలో జరుపుకునే విధంగా తీర్థట్రస్టు నిర్ణయించిందని తెలిపారు. ఈ వేడుకను పురస్కరించుకుని దేశంలోని ప్రతి హిందూ కుటుంబ సభ్యునికి అయోధ్యలోని బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు, చిత్రపటం చేర్చాలని శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్టు నిర్ణయించినట్లు తెలిపారు.అయోధ్య మందిరం నుండి లింగాల రామయ్య సన్నిధికి ఆదివారం ఉదయం అక్షింతలు శ్రీరామ సేవకుల ద్వారా చేరినట్లు తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అందజేశారు. రామయ్య అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాలకు చేర్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మద్దిలేటి, కార్యవాహ సభ్యులు రవికుమార్, శివనందన్, శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు భోజ్యానాయక్, మురళి, విష్ణుస్వామి, సైదులు, సాయి, శ్రీను, సాయిరాం పాల్గొన్నారు.



లింగాల రామాలయానికి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలు

# అవినీతిపరులకు బుద్ధి చెప్తా:మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్,డిసెంబరు 31 ప్రభాతవార్త :** పెంట్లవెల్లి మండల పరిధిలోని మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఆరు గ్యారంటీలను అమలు చేసి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం, మంచాలకట్ట గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి జూపల్లి పాల్గొని మాట్లాడారు. సోనియమ్మ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి లబ్దిదారునికి ఆరు గ్యారంటీలు అందేలా చేయడమే ఈ ప్రజా ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. మంచాలకట్ట గ్రామంలో గత 5 సంవత్సరాలుగా ప్రజలను పలు విధాలూ తీవ్ర వేధింపులకు గురి చేసిన నీతిలేని నేతలకు బుద్ధి చెప్తామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో మల్లేశ్వరం, మంచాలకట్ట గ్రామాల ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల ప్రజా పరిషత్, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి

## మద్దెల సుష్మను అభినందించిన మంత్రి



**కొల్లాపూర్,డిసెంబరు 31 ప్రభాతవార్త :** కొల్లాపూర్ పట్టణానికి చెందిన మద్దెల రామదాసు కూతురు సుష్మ బీఎస్సీ అగ్రికల్చర్ ఆర్గానిక్ కోర్సులో స్టేట్ 14వ ర్యాంక్ సాధించి జగిత్యాలలో గవర్నమెంట్ ఫ్రీ సీట్ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు మద్దెల సుష్మను అభినందించి శాలువాతో సన్మానించి ఇలాంటి విజయాలను ఇంకా భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని స్వీట్ తినిపించి ఆశీర్వదించారు.



మల్లన్న స్వామి ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి

## మల్లన్నస్వామి జాతరలో ఎమ్మెల్యే పూజలు

**నారాయణఖేడ్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** కల్హేర్ మండలం మాసాన్ పల్లి గ్రామశివారులోగల మల్లన్నస్వామి జాతరలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి పాల్గొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువతో సన్మానించారు. అనంతరం జాతరలో పాల్గొన్న మహోత్సవ కమిటీ సభ్యులకు ప్రజలకు ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ యాదవరెడ్డి, మల్‌దొడ్డి తుకారం,శ్రీకాంత్, అనిల్‌సేట్, హుస్సేన్, బలరాం, రమేష్, కృష్ణ, శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## లింగాయత్ సమాజ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



లింగాయత్ సమాజ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

**జహీరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం పట్టణంలో ఆవిష్కరించారు. అంతకుముందు మహాత్మా బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రార్థనలుచేశారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షులు శెట్కార్ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రేకుళ్లి సుభాష్, బాధ్యులు బస్వరాజ్ మడపతి, అశోక్‌కుమార్ బశెట్టి, ఉల్లిగడ్డ చంద్రశేఖర్, అప్పారావు గున్నెల్లి, సోమశేఖర్ పాటిల్, బెండి చంద్రశేఖర్, మాతంశెట్టి రాజ్‌కుమార్, బస్వరాజ్, అరుణ్‌కుమార్, హోతి ప్రకాశ్, విజయకుమార్ మడపతి, మల్లికార్జున్ తంబోలె, అక్కన బళగ అధ్యక్షురాలు మంజుల మడపతి, పద్మజ ఉల్లిగడ్డ పాల్గొన్నారు.

## జాతర ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి



శ్రీ భ్రమరాంబ మల్లికార్జున జాతరలో పాల్గొన్న మాజీమంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** మండలంలోని ఉగ్గేల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉగ్గెలి రాములు, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హర్షద్ అలీ, నరసింహారెడ్డి, మక్బుద్, శివకుమార్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## టీబేస్ కొత్త సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



టీబేస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** టీబేస్ జహీరాబాద్ డివిజన్ 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివాసం ఆవిష్కరించారు. టీబేస్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు తుకారాం చవాన్, ప్రధాన కార్యదర్శి హన్మంతు పవార్, గౌరవ అధ్యక్షులు హీరు రాథోడ్‌ల ఆధ్వరనయంలో పట్టణంలో నిర్వహించిన కొత్త సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసిరామ్ రాథోడ్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చవాన్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు, ఎంఈఓ శ్రీనివాస్ బానోత్, ఎంఈఓ మారుతి రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ బానోత్, హీరాలాల్ చవాన్, నాను సింగ్ రాథోడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జైసింగ్ చవాన్, నాయకులు హీరా లాల్ పవార్, ఎల్‌ఐసి శెట్టి, కిషన్ చవాన్, టోగు చవాన్, ఖీరు రాథోడ్, ధల్‌సింగ్ రాథోడ్, మోహన్ సింగ్ రాథోడ్, ధన్‌రాజ్ లెక్చరర్, సుభాస్, లాల్‌సింగ్, వేణు రాథోడ్, సిఆర్‌పి పండు పవార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బసవన్న ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



బసవన్న నాగుల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**ఝరాసంగం, డిసెంబరు 31, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బసవన్న, నాగుల ఆలయలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని బసవన్న ఆలయ ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమాలు, పూర్ణాహుతి, అభిషేక పూజలను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్త ఎంపి సంగమేశ్వర్ పాటిల్, ఎంపిటిసి సభ్యులు రజిని ప్రియ సంతోష్ పాటిల్, సిద్దన్న పాటిల్, శివప్రసాద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలి

### రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పత్రాల యాదాగౌడ్

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**

యాసంగి పంటల కోసం రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాలో జమ చేసి రైతులను ఆదుకోవాలని రైతురక్షణ సమితీ జిల్లా అధ్యక్షులు పత్రాల యాదాగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబంధు డబ్బులు విడుదల అయినప్పటికి రైతుల ఖాతాలో జమ చేయలేదన్నారు.ఈ మేరకు యాసంగి పంటల పెట్టుబడికోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుబంధు డబ్బులను వారి ఖాతాలో జమ చేయాలన్నారు.కాగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరిట ఎకరాకు 15 వేలు ఇస్తామని ప్రకటించిన ఇంతవరకు అతీ గతీ లేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు డబ్బులైనా రైతుల ఖాతాలో జమ చేసి రైతులను ఆదుకోవాలని రైతు రక్షణ సమితీ జిల్లా అధ్యక్షులు పత్రాల యాదాగౌడ్ విజ్ఞప్తి చేశారు.

# బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయనున్న శ్రీధర్‌గుప్త

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి భారీ నష్టం కలగనుంది. మాజీ ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడు, అత్యంత సన్నిహితుడు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఫైడి శ్రీధర్‌గుప్త బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఫైడి శ్రీధర్‌గుప్త తెలంగాణ ఉద్యమ సమయం నుండి బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరిగింది. శ్రీధర్‌గుప్త మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలో పార్టీ సమావేశాలకు, అభివృద్ధికి వెన్నంటి ఉండి ఎంతగానో కృషి చేశారు. కాగా ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే టికెట్టు మదన్‌రెడ్డికి అధిష్టానం ఇవ్వకపోగా ప్రస్తుత ఎమ్మెల్యే సునీతా రెడ్డి కేటాయించింది. అలాగే మాజీఎమ్మెల్యే మదన్ రెడ్డికి మెదక్ ఎంపి టికెట్టు ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చిన విషయం తెల్సిందే. అయితే ప్రస్తుతం మెదక్ నుండి మాజీ సిఎం కెసిఆర్ ఎంపిగా బరిలో ఉంటారన్న వార్తలు రావడంతో మదన్‌రెడ్డికి మెదక్ ఎంపి టికెట్టు రాదేమోన్న సందేహాలు కలుగుతున్నాయి. దీంతో నర్సాపూర్ ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వక మెదక్ ఎంపి టికెట్టు మదన్‌రెడ్డికి రాకపోవడంతో మనస్థాపం చెంది శ్రీధర్‌గుప్త బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గుప్త మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిని బిఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మనస్థాపం చెంది బిఆర్ఎస్ గుడ్‌బై చెబుతున్నానన్నారు. ఈమేరకు అనుచరగణంతో చర్చించి పెద్దఎత్తున సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. దీంతో నర్సాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి తీవ్రంగా నష్టం కలుగునుందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు



బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరనున్న ఫైడి శ్రీధర్‌గుప్త

## శబరిమల అయ్యప్ప దర్శనానికి బయలుదేరిన దీక్షాపరులు

**మొయినాబాద్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** మొయినాబాద్ మండల పరిధిలోని యెన్కెపల్లి గ్రామంలో హరి హరి తనయుడు అయ్యప్ప స్వామి దీక్షా పరులు సుమారు 41 రోజుల పాటు అయ్యప్ప మాల ధరించి నియమనిష్టలతో పూజలు చేశారు. అనం తరం స్వామి దర్శనానికి ఆదివారం బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రం నుంచి భారీ సంఖ్యలో అయ్యప్ప భక్తులు శబరిమల దర్శనానికి వెళ్లారు. దీనికి ముందు అయ్యప్పలు మహాపడి పూజను వైభవోపేతంగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వామి వారి భక్తిగీతాలను ఆలపిస్తూ శబరిమల బయలుదేరి వెళ్లారు. అయ్యప్పల కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు పెద్ద ఎత్తున వచ్చి శబరిమల వెళ్లే వారిని సాగనంపారు. ఈ సందర్భంగా యెన్కెపల్లి ఎంపిటిసి రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రితీష్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరక్టర్ కుమ్మరి రాము, సన్నిధానం గురుస్వామి, కృష్ణ గురుస్వామి, రమేష్‌గౌడ్ గురుస్వామి, దామోదర్‌రెడ్డి స్వామి, రామచందర్ ముది రా జ్, అనంతరెడ్డి, సురేష్ గురుస్వామి, పెండ్యాల శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్, గ్రామ వార్డు సభ్యులు, సుధాకర్, సురేష్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కళ్యాణ మహోత్సవం

**శంకర్‌పల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** నేటి ఆధునిక యుగంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న మనిషి జీవితానికి ఊరటనిచ్చేది భగవంతుని కృప మాత్రమే అని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి భీమ్ భరత్ అన్నారు. ఆదివారం నాడు అత్యంత వైభవంగా శ్రీ గొల్ల కేతమ్మ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం గ్రామ పెద్దలు ప్రముఖుల సమక్షంలో వైభవోపేతంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భీమ్ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవంలో భీమ్ భరత్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత బీరప్ప గొల్ల కేతమ్మ కళ్యాణంలో పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతమని అన్నారు. ఇంతటి ప్రతిష్ట కలిగిన ఆలయ అభివృద్ధికి శాయశక్తులా అంకిత భావంతో తన వంతు సహకారం అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. తనపై ప్రత్యేక ప్రేమాభిమానాలు చూపిం చిన ఆలయ నిర్వాహకులకు, గ్రామ ప్రజలకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్య క్షుడు జనార్ధన్‌రెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, దేవుల నాయక్, సర్పంచ్ మోహన్‌రెడ్డి, అశోక్ నాయక్, ప్రశాంత్, శరత్‌రెడ్డి, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి

**కొడంగల్, డిసెంబర్ 31ప్రభాతవార్త** భీమా కోరేగావ్ 206వ శౌర్య దిన్సోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కొడంగల్‌లో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణా ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్,ఎస్సీ,ఎస్టీ మార్టిన్ కమిటీ సభ్యులు కోస్గీ దస్తప్పలు పిలుపునిచ్చారు.ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతు సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు గాంధీనగర్ నుంచి అంబేద క్‌ర్ చౌరస్తావరకు రా ్యలీ చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని దళిత,బహుజన బిడ్డలు అధిక సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా జైభీమ్ యూత్ అధ్యక్షులు సాయికుమార్,అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రావులపల్లి హన్మంతు, వెంకట్, మహేష్, శ్రీనివాస్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆవు మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

### యజమాని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**పూడూరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** ఆవు మృతికి కారణమైన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ యజమాని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసి న సంఘటన పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో చోటు చేసు కుంది. ఎస్ఐ గిరి కథనం ప్రకారం వికారాబాద్‌జిల్లా పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన కిష్టం గోపాల్ (48) అనే పశువుల రైతు అదే గ్రామానికి చెందిన భూమిలో యజమాని హైమద్‌బాబా అనుమతితో కొట్టాన్ని నిర్మించుకొని 40 పశువులను కట్టేస్తున్నాడు. అయితే ఈనెల 30వతేదీ మధ్యాహ్నం సమయంలో అదే గ్రామానికి చెందిన కంతల భీమయ్య,కిష్టం శ్రీశైలం,కిష్టం నరేష్,తూంపల్లి రాఘవేందర్. నాల్లపురం లక్ష్మ య్య లు,మరికొందరు వ్యక్తులతో కలిసి రాఘవేందర్ జేసిబితో పశువుల యజమాని వద్దన్నా వినకుండా కొట్టాన్ని కూల్చివేశారు. అదేరోజు సాయంత్రం పశువుల యజమాని భోజనకోసం ఇంటికి వెళ్లి తిరిగి కొట్టవద్దకు వచ్చేసరికి ఆవుమృతి చెందిఉంది.ఈ విష యంపై పశువుల యాజమాని పైన పేర్కొన్న వ్యక్తులపై పిర్యాదు చేయగా,ఈ మేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అన్నదానం ... మహాదానం

### అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసిన కాంగ్రెస్ నేత

**నందిగామ డిసెంబరు31,ప్రభాతవార్త :** అన్నదానం మహాదాన మని, ఈ పుణ్యకార్యం చేసిన వారి జీవితం ధన్యమని మహాభాగ్య మని గురుస్వామి హరిజీవన్ స్పష్టం చేశారు.ఆదివారం నందిగామ మండలం బండనుగూడ గ్రామానికి చెందదిన కాంగ్రెస్ సీనియర్ నేత పసుల బుచ్చయ్య అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వాము లకు అన్నదానం నిర్వహించారు.అనంతరం అన్నదాన ప్రభు పసుల బుచ్చయ్య లలిత దంపతులను ఆలయ కమిటీ నిర్వహ కులు పూలమాల శాలువా వేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దేపల్లే కుమారస్వామి గౌడ్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్య క్షుడు జంగ నరసింహులు స్వాములు తుమ్మల నరసింహులు యా దవ్ ,నంబర్ రాజు,శ్రీకాంత్ గౌడ్,బండారం సుదర్శన్ గౌడ్, మల్లే ష్ యాదవ్,యాదయ్య, ఆయా గ్రామాల నుండి వచ్చిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

### న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్యే

**నందిగామ డిసెంబరు 31, ప్రభాతవార్త :**

నూతన సంవత్సరం 2024ను పురస్కరించుకొని పలువరు రాజకీయ ప్రముఖులు, అధికారులు మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, కేశంపేట జడ్పిటిసి తంద్రా విశాల శ్రవణ్‌రెడ్డి, ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్‌లు భగవంతుని ఆకాంక్షిస్తూ న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నందిగామ సరిహ ద్దులో ఉన్న ఎఫ్‌సిఎన్‌లో జరిగిన అనాధల అన్నదాన కార్యక్ర మంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్యేలు ప్రజలందరు సుఖసంతోషాలు,సిరిసంపదలు,సంపూర్ణ ఆరోగ్యం కలగాలని వారు భగవంతుని వేడుకున్నారు.యువతి, యువకు లకు, న్యూఇయర్‌లో నూతన ఒరవడితో, కొత్త ప్రణాళికలతో సిద్ధమై, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని వారు కోరుకున్నారు.

## హనుమాన్ విగ్రహ నిర్మాణ స్థలం భూమి పూజకు రావాలి

**ఆదిభట్ల డిసెంబరు31,ప్రభాతవార్త :** హరిహర అఖండ క్షేత్రం పెద్దచెరువు కోనకట్ట వీరపట్నం పరిసర ప్రాంతాలు సుభిక్షంగా సస్య శామలంగా ఉండాలని కాంక్షిస్తూ నిర్మించ తలపెట్టిన 108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహ నిర్మాణ స్థలం భూమి పూజకోసం స్థానిక శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డికి సధావెంకట్‌రెడ్డి ఆహ్వానం ఆదివారం అందజేశారు.అందుకు ఎమ్మెల్యే సహానుకులంగా స్పందించి మంచి నిర్ణయం ఆధ్యాత్మిక చింతనతో మానసి ప్రశాంతత ఉంటుందని అందుకు తన వంతు సహయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని అభయమించారు. పెద్దచెరు వుకట్టను పర్యటక కేంద్రం తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పంచ ముఖ హనుమాన్ విగ్రహ ఏర్పాటుతో మరింత అద్యత్మిక క్షేత్రంగా మారనుందన్నారు.అనంతరం అఖండక్షేత్ర వ్యవస్థాపకులు సధా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..భూమి పూజ జనవరి 09 2024 ఉద యం జగద్గురు శంకరాచార్యులు హంపీ విరూపాక్ష విధ్యారణ్య మహా సంస్థాన పీఠాధిశులు విధ్యారణ్య భారతి స్వామీజీ క్షేత్ర సంద ర్శనకు విచేయుచ్చునట్లు తెలిపారు. పాండు రంగా రెడ్డి,కౌన్సిలర్ నందు,రమేష్,చందు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకు చేరుకున్న అయోధ్య రామయ్య అక్షింతలు

**కందుకూరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** రామయ్య అక్షింతలు మండల పరిదిలోని గ్రామ గ్రామానికి అందించే విదంగా ప్రజలకు చేరేవిదంగా వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వేదపండితులు రేవల్లి రాజుశర్మ వేద మంత్రోచ్చరణల మద్య అక్షింతలకు పూజలు చేసి సవ్వయం సేవకులకు, రామయ్య భక్తులకు అక్షింతల వితరణ భాద్య తలను అప్పగించారు. ఈ సందర్భంగా అర్‌ఎస్‌ఎస్ మహేశ్వరం జిల్లా ప్రచారఖ్ అం జనేయులు మాట్లాడుతు 500 వందల సంవత్సరాల నిరీక్షణ తర్వాత సాఫల్య మైన అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ట జరుపుకోవడం జరుగుతుందన్నారు. 2024 జనవరి 22 జరిగే ఈ కార్యక్రమం దేశ, విదేశాలలోని రామయ్యభక్తులు హిందుత్వ వాదులందరు దీపాలళి పండుగలా ప్రతి గుమ్మంముందు ఇందిలోను దీపాలను వెలిగించి ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. రామయ్య అక్షిం తలు గ్రామ గ్రామాన ప్రతి హిందు కుటుంబానికి చేరేవిదంగా వితరణ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్న భక్తులు, సంయోజఖ్‌లు హిందు భంధువులు బాద్యతగా అందించాలని కోరారు. అయోధ్య రామయ్య జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సం యోజఖ్ కండడి శ్రీరామ్, కందుకూరు ఖండ అర్‌ఎస్‌ఎస్ కార్యవాహ శ్రీకాంత్, సహకార్యవాహ గౌర శ్రీను, ప్రవీణ్, ఖండ కార్యకరనీ విష్ణు, అమ్రవాది మనోహర్, సురేష్, అనిల్, సాయి, ప్రవీణ్‌గౌడ్, జిల్లా సహ భౌద్ధిఖ్ ప్రముఖ్ కంబాలపల్లి గిరిబాబు పాల్గొన్నారు.

## నేదునూరు మాజీ సర్పంచ్ అనారోగ్యంతో మృతి

**కందుకూరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** నేదునూరు మాజీ సర్పంచ్ బద్దుల మల్లయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందారు. సౌమ్యుడు మృదు స్వభావి అయిన మలయ్య మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయి న నేదునూరు గ్రామ సర్పంచ్‌గా 2006 నుండి ఐదు సంవత్సరాల కాలం పదవీ బాద్యతలు నిర్వహించారు. అయన పాలనలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్య క్రమాలను నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు. సిపిఎం సహకారంతో సర్పం చ్‌గా ఎన్నికైనా పార్టీల కతీతంగా ప్రజలను కలుపుకుని వెల్లేవారని అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. మల్లయ్య అకాల మర ణం పట్ల కమ్యూనిస్టు నాయకులు అంకగళ్ళ కుమార్, ఉపసర్పంచ్ సిపిఎం మం డల కార్యదర్శి బి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఉన్ని సాయిలు, యం యాదయ్య, రాములు, జంగయ్య మల్లయ్య నివాసానికివెళ్లి శ్రద్దాంజలి ఘటించి వారి కుటుం బానికి సానుబూతిని తెలియజేశారు.

# అక్షర స్కూల్ విద్యార్థులు అదుర్స్

### జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ

### మొబైల్ మైక్రోస్కోప్ ఎగ్జిబిట్‌కు ఉత్తమ బహుమతి

### ఇస్రో, నాసాలో ప్రదర్శనకు అనుమతి

**తాండూరు, డిసెంబరు 31, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులోని అక్షర స్కూల్ విద్యార్థులు అదుర్స్ అనిపించుకున్నారు. జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తమ ప్రతిభ చాటారు. మొబైల్ మైక్రోస్కోప్ ఎగ్జిట్‌కు ఉత్తమ బహుమతి పొందారు. సూక్ష్మ కణాలను పెద్దదిగా చూపే, అరచేతిలో పట్టే మొబైల్ మైక్రోస్కోప్‌ను తయారు చేసిన అక్షర స్కూల్ విద్యార్థులు సందీప్, అనిరుద్, వర్షలు జాతీయ స్థాయిలో ప్రతిభను చూపించారు. శనివారం మహారాష్ట్రలోని పూణేలో జరిగిన 50వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ బహుమతి సాధించారు. జిల్లా, రాష్ట్ర, సౌత్ జోన్ స్థాయిలో ప్రతిభను చూపిస్తూ ఏకంగా జాతీయ స్థాయికి చేరుకోవడంతో పాటు ఇస్రో, నాసా, ఐఐఎస్‌ఈఆర్‌లో ప్రదర్శించేందుకు అనుమతి పొంది అదుర్స్ అనిపించారు. అంతేకాకుండా వివో ఇగ్నేట్(టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అవార్డు) అవార్డు కోసం జాబితాలో తన పేరు నమోదు చేసుకుంది. అత్యుత్తమ ఎగ్జిబిట్‌ని తయారు చేసి ప్రతిభ చూపిన అక్షర స్కూల్ విద్యార్థులకు జాతీయ స్థాయి ప్రశంస పత్రాలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అయితే, కేవలం రూ.300ల తక్కువ ఖర్చుతోనే మొబైల్ మైక్రోస్కోప్‌ను రూపొందించడంతో పాటు స్మార్ట్ టెక్నాలజీతో పనిచేసేవిధంగా విద్యార్థులు తయారు చేశారు. దీని ద్వార పరిశీలించే వాటిని స్మార్ట్ ఫోన్‌తో పాటు కంప్యూటర్, ట్యాబ్, ఎల్‌ఈడీ తెర, లాప్‌ట్యా ప్‌లలో చిత్రాలు, వీడియోల రూపంలో చూసుకునే అవకాశం ఉంది. మరోవైపు అక్షర స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడంతో ఇటు పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు సంబరాలు చేసుకున్నారు.

## రైతులకు వ్యవసాయ రుణాలు అందించాలి

**బొంరాస్‌పేట్,డిసెంబర్31,ప్రభాతవార్త :** ఎస్‌బిఐ బ్యాంకులో సిబ్బందిని పెంచి 26గ్రామాలకు చెందిన ఖాతాదారులు,రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సమస్య పరిష్కారం కోసం జనవరి 3వ తేది నుండి బ్యాంకు ముందు రిలే నిరహార దీక్షలు నిర్వహిస్తామని ప్రజాసంఘాల జిల్లా అధ్యక్షులు కొత్తూర్ చంద్రయ్య తెలిపా రు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బొంరాస్‌పేట్ శాఖలో సిబ్బంది కొరతను తీర్చాలంటూ గత వారంలో రీజినల్ మేనేజర్(ఆర్‌ఎం)కు వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 19న వినతిపత్రం అందించడం జరిగిందని నేటికి సమస్య పరిష్కారం కాలేదన్నారు. సిబ్బంది కొరతతో రైతులు,ఖాతాదారులకు చాలా ఇబ్బందిగా ఉందని,కొత్త సిబ్బం దిని నియామించడంతో అందరికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు.సిబ్బంది కొరత తో బ్యాంకు అనుబంధగా ఉన్న గ్రామాలలో సూమారు 6వేలమంది ఖాతాదారులు ఉన్నారని వీరితోపాటు రైతులకు రైతుబంధు,కొత్తగా పంట రుణాలు మంజూరు చేయడం అలస్యం అవుతుందన్నారు.ఈ జనవరి 3వ తేది వరకు సిబ్బందిని నియమించకపోతే బ్యాంకు ముందు రిలే నిరహారదీక్షలు కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలోవెంకటయ్య, లక్ష్మణ్,చిన్నయ్య, అమృతయ్య,రామకృష్ణ, సోమ్లనాయక్ పాల్గొన్నారు.



గంగపటంను ఊరేగింపుగా తీసుకెళుతున్న యాదవ సంఘం సభ్యులు

## మల్లికార్జునస్వామి మహోత్సవంలో ఘనంగా గంగపటం

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో రెండు రోజులుగా శ్రీకేతకీ భ్రమరాంబిక సహిత మల్లిఖార్జునస్వామి వార్షిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి ఈ మేరకు ఆదివారం ఒగ్గు పూజారుల అధ్వర్యంలో నర్సాపూర్ యాదవ సంఘం సమక్షంలో గంగపటం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు మాచు నూరి మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గంగపటంను ఊరేగింపుగా మరకత మల్లి కార్జునస్వామి ఆలయంవద్ద సాగింది.ఇక్కడ గంగపటం కార్యక్రమంలో భాగం గా ఒగ్గు పూజారుల ప్రత్యేక పూజలు చేసి గంగపటం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. అనంతరం ఈ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా వచ్చిన భక్తులు అన్నదానాన్ని స్వీకరించారు. కాగా ఈ వార్షిక మహోత్స వంలో బాగంగా సోమవారం దేవుని కళ్యాణం, బోనాలు, ఎల్లమ్మ దేవకి ప్రత్యేక పూజలు బోనాలు ఒడిబియ్యం వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు మల్లేసయాదవ్ తెలిపారు. ఈవార్షికోత్సవ మహోత్సవాలకు భక్తులు ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మల్లేష్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో మాచునూరి రాజుయాదవ్, ఆశన్నగారి శ్రీశైలంయాదవ్, ఎద్దు రమేశ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, రమేశ్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, చంద్రయ్యయాదవ్, రాములుయాదవ్, నర్సాపూర్ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రుద్రాభాషేకం

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలోని శ్రీకేతకీ భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆలయ నిర్మాణదాత. బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా రుద్రాభాషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి, వేద పండితులు హరిప్రసాద్‌శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీమల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, పంచామృతాబిషేకం, పత్రి పూజా, నమకం, చమకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ ఆలయం నిర్మా ణం చేపిన్పటినుండి ప్రతి ఆదివారం పర్వదినాల్లో శ్రీ మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేయడం జరుగుతందని తెలిపారు. ఈ మేరకు భక్తులు ప్రజలు ఆ భగవంతుడిని దర్శించుకోని ఆయన కృపకు పాత్రులు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

**పుల్కల్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మిన్పూర్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గ్రామంలోని 4వ వార్డు సభ్యులు అయ్యారి మురళి సోదరుడి వివాహం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అక్కడినుంచి గ్రామంలోని 1వ వార్డుసభ్యులు భగవంత్ కుమార్తె వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ముద్దాయిపేట విజయ్, నాయకులు యాదగిరి రెడ్డి, మిన్పూర్ గ్రామ అధ్యక్షులు భిక్షపతి, మండల గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు జైసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**మునిపల్లి, డిసెంబరు 31, ప్రభాతవార్త:** మండలంలోని అల్లాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారుడు సంగమేష్ నిర్మించిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు చంటి క్రాంతి కిరణ్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సాయికుమార్, రాయికోడ్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నారాయణ, మండల పార్టీ మాజీ అధ్యక్షులు సతీష్, నాయకులు నాగేష్, మునిపల్లి గ్రామ అధ్యక్షులు నర్సింలు, తక్కడపల్లి ఆనంద్, బిచ్చయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలకిషన్‌గౌడ్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట కోమటి చెరువు ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా పల్లె బాలకిషన్‌గౌడ్‌తో పాటు నూతన కార్యవర్గాన్ని ఆదివారం రోజున సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం గౌరవ అధ్యక్షులుగా బొమ్మల యాదగిరి,ప్రధాన కార్యదర్శిగా కెమ్మసారం రాజేష్,ఉపాధ్యక్షులుగా పల్లె భాస్కర్‌గౌడ్,కోశాధికారిగా చుక్క చంద్రం,ప్రచార కార్యదర్శిగా విజయసాగర్,సలహాదారులుగా మెర్గు యాదగిరి,మిద్దె రవి,పింకి అరవింద్,నాయిని జైపాల్‌రెడ్డి,కెమ్మసారి దుర్గయ్య,కొండ రాజులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన బాలకిషన్ తన నియామకానికి సహకరించిన సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చౌదర్‌పల్లిలో సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్

**యాచారం,డిసెంబర్31,ప్రభాతవార్త** యాచారం మండల పరిదిలోని చౌదర్‌పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సిపిఎల్2 క్రికెట్ టోర్నమెంట్ సర్పంచ్ నాయిని నర్సంహ్మారెడ్డి,ఎంపిటిసి రాజెం దర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ్మా చౌదర్‌పల్లి క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన ఎస్ఐగా విదులు నిర్వహిస్తున్న అమీర్‌పేట్ శ్రీశైలం పోత్స హంతో అదివారం ప్రారభించారు.ఈ సంద ర్బంగా సర్పంచ్ మాట్లాడుతు..క్రిడలు మానసిక ఉల్లాసంతో పాటు శారిరక దార్డ్యున్ని పెంపోందించి పోలీసుశాఖ సంబందించిన పోటి పరిక్షలకు ఉపయోగ పడుతుందన్నారు.చౌదర్‌పల్లి గ్రామంలోని యువకులను 6 టిములుగా విభజించి క్రికెట్ టోర్నమెంట్ ఎర్పాటు చేసినట్లు తెలిపారు గ్రామస్తులు యువత తదితరులు పాల్గోన్నారు

## గడ్డమల్లయ్యగుడలో ఘనంగా పడిపూజ

**యాచారం,డిసెంబర్31,ప్రభాతవార్త** అన్ని ధానల కంటే అన్నధానం మహాదానం అంటారు అయ్యప్ప స్వాములకు చేస్తే మరింత శుభం జరుగుతుందని నమ్ముతారు అందుకు మండల పరిదిలోని గడ్డమల్లయ్యగుడ గ్రామంలో అయ్యప్ప పడిపూజలో బడంగ్‌పేట్ మాజి మున్సిపల్ చైర్మన్ సామ నర్సింహ్మగౌడ్ స్వాములకు అన్నధాన ఏర్పాటు చేశారు, స్థానికులు బాసాని రాకేష్‌రెడ్డి పడిపూజ కార్యక్రమా నికి అలంకరణ ఏర్పాటు చేశారు. పూజ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి విచ్చేసిన స్వాములు, భక్తులు గ్రామస్తులు స్వాముల పాటలకు మంత్రముగ్దులైన్నారు. స్వాములకు అన్న ధానం,పడిపూజ అలంకరణ చెయించిన వారికి స్వాములు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అచ్చన జంగయ్య స్వామి, ఉపసర్పంచ్ యార వెంకటేష్ స్వామి,గామస్తులు తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం

**కొడంగల్ రూరల్, డిసెంబరు 31 (ప్రభాత వార్త)ః** భారత కమ్యూ నిస్టు పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని సీపీఐ నాయకులు ఘనం గా నిర్వహించారు. ఆదివారం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని చంద్రకల్‌లో పార్టీ సీనియర్ నాయకులు ఇందనూర్ బషీర్ ఆధ్వర్యం లో పార్టీ జెండాను ఎగరవేసి మాట్లాడారు. సీపీఐ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళాల ముందుండే పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎండీ.మహమూద్, ఎండీ.అబ్దుల్, రహీం, ఎర్రరాజు, అనంతమ్మ, సాయప్ప, లక్ష్మప్ప, రఫీ, సురేశ్, సోను, చాకలి గుం డప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తా : జడ్పీటీసీ

**షాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** గ్రామాభివృద్దికి తనవంతు కృషి చేస్తానని జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ అనుబంధ గ్రామమైన అంకుగూడలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్దికి తనవంతు కృషి చేస్తానని తెలిపా రు. సర్పంచ్ మల్లేష్, నాయకులు రాందేవ్,గ్రామస్థులు తదితరులు ఉన్నారు.